
ప్రజాశక్తి
శుక్రవారం 11 ఏప్రిల్ 2025
5
విజయనగరం



మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష 21కు వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 20న జరగాల్సిన ప్రవేశ పరీక్ష 21వ తేదీకి వాయిదా పడినట్లు డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు. ఈనెల 20న జరగాల్సిన పరీక్ష 21వ తేదీనికి మారిందని, దరఖాస్తుదారులు గమనించాలని కోరారు. జిల్లాలో గల 13 ఆదర్శపాఠశాలలలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో విద్యార్థులను చేర్చుకునేందుకు ఈనెల 20న ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా జరగబోవు ప్రవేశ పరీక్ష ఈస్టర్ పర్వదినం సందర్భంగా 21వ తేదీకి మారినట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు.



మునకలవలసలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న సచివాలయం

విజయనగరం జిల్లాలో గత వైసిపి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణలను కోట్లాది రూపాయలతో చేపట్టింది. అయితే అప్పటి వైసిపి నాయకులే కాంట్రాక్టర్లుగా ఉండి కొంత నిధులు పెట్టిన నిర్మాణాలుచేపట్టారు. మరికొంత మంది ఖర్చు చేసిన నగదు వస్తుందో రాదోనని భయపడి అసంపూర్తిగా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను వదిలేశారు. ప్రభుత్వం కొంతవరకు బిల్లు చెల్లించినా, ఆ తరువాత బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్మాణాలు చేపట్టడానికి ముందు రాక ప్రభుత్వ కార్యాలయాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి.

ఇదీ ఆర్‌ఎస్‌కెల పరిస్థితి

జిల్లాలో రైతు సేవా కేంద్రాలు 496 మంజూరు కాగా, 35 కేంద్రాలకు స్థలాలు లేక ప్రారంభం కాలేదు. 15 బిలో బేస్‌మెంట్ స్థాయిలో ఉండగా, 31 బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. రూఫ్ లెవెల్ 8, మొదటి స్లాబ్ 45 స్థాయిలో ఉన్నాయి. ఫినిషింగ్ స్థాయిలో 55 ఉండడంతో 307 పూర్తయినట్లు పంచాయతీరాజ్ అధికారుల లెక్కల్లో తేలింది. వీటికి రూ.11874కోట్లు ప్రతిపాదనలు పంపించగా, రూ.8032.55 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ.3841.88 కోట్లు అప్పటి ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందని లెక్కల్లో తేలింది.

- **అసంపూర్తిగా సచివాలయాలు, ఆర్‌ఎస్‌కెలు, హెల్త్ క్లినిక్‌లు**
- **ఐదేళ్లు గడిచినా పూర్తికాని భవన నిర్మాణాలు**

ప్రభుత్వ కార్యాలయాలకు గ్రహణం



అంబాడలో నిర్మాణంలో ఉన్న సచివాలయం

ప్రజాశక్తి-రేగిడి

జిల్లాలో ఐదేళ్ల క్రితం చేపట్టిన ఆర్‌బికెలు, సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పలుచోట్ల ఇంకా పూర్తి కాలేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు అద్దె భవనాల్లోనూ, ఇరుకు గదుల్లోనూ విధులు నిర్వహించవలసిన పరిస్థితి నెలకొంది.. మరికొన్ని సచివాలయాల్లో పూర్తిగా కూర్చునేందుకు వీలులేని పరిస్థితిలో విధులు నిర్వహించడం ఆటంకంగా ఉంది. జిల్లాలో 530 సచివాలయాలు మంజూరు కాగా, వీటిలో స్థలాలు లేక ఆరు ప్రారంభం కాలేదు. బేస్‌మెంట్ లెవల్ లోపు 8, బేస్‌మెంట్ లెవల్ 9, రూఫ్ లెవెల్ 4, మొదటి స్లాబ్ వరకు 12, రెండవ స్లాబ్ 41, ఫినిషింగ్ అయిన సచివాలయాలు 62 ఉన్నాయి. 388 సచివాలయ భవనాలు పూర్తయ్యాయి. వీటి నిర్మాణానికి మొత్తం 20,841.40 కోట్ల రూపాయలు అంచనా బడ్జెట్ వేశారు. 16,175.69కోట్ల నిధులను ప్రభుత్వం సమకూర్చింది. 4665.71 కోట్ల రూపాయలు ఇంకా ప్రభుత్వం నుంచి రావలసి ఉందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 435 హెల్త్ క్లినిక్ లు మంజూరు కాగా వీటిలో స్థలాలు లేక 50 ప్రారంభించలేదు. 181 భవన నిర్మాణాలు పూర్తి కాగా, మిగతావన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణాలకు రూ.9048 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపించగా, 5120.35 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఇంకా 39 27 .65 కోట్ల రూపాయలు అప్పటి ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది. ఈ నిధులు రాకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి.

నిధులు రాక నిర్మాణాలు నిలిపివేశాం



అంబాడ వెంకటాపురంలో సచివాలయం, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ మంజూర య్యాయి. వీటికి నిర్మాణాలు చేపట్టాం. కొంత నిధులు వచ్చిన , మిగతా నిధులు రాక స్లాబ్ స్థాయి వరకు నిర్మించాం. ఇంతవరకు నిధులు రాకపోవడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిపివేశాం.

- చుక్క వెంకటినాయుడు, అంబాడ సర్పంచ్

అప్పులు చేసి నిర్మించాం



అప్పులు చేసి సచివాలయ నిర్మాణం చేపట్టాం. కొంత నగదు వచ్చిన స్లాబ్ స్థాయి వరకు నిర్మించాం. మిగతా నగదు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో నిర్మాణాలు నిలిపివేశాం. నిధులు వస్తే నిర్మాణాలు చేపడతాం.

-ఎం.శ్రీనివాస్, సంకిలి

నిధులు వచ్చిన వెంటనే..

వైసిపి ప్రభుత్వ హయాంలో తొలుత సచివాలయాలు, ఆ తర్వాత ఏడాది రైతు భరోసా కేంద్రాలు, అనంతరం హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ మేరకు పనులు చేపట్టాం. రూ. 29328.19 కోట్లు రావలసి ఉంది. నిధులు వచ్చిన వెంటనే ఖాతాలో జమ చేశాం. ప్రస్తుతం నిధులు కొరత ఉంది. వచ్చిన వెంటనే కాంట్రాక్టర్ల ఖాతాలో జమ చేసి నిర్మాణాలు పూర్తి చేస్తాం.

- రాజశేఖర్, పంచాయతీరాజ్ ఎస్ఇ



సమావేశంలో పాల్గొన్న పిఎంశ్రీ రాష్ట్ర బృందం

ప్రభుత్వ పాఠశాలలకు సకల సౌకర్యాలు

జిల్లాలో పిఎం శ్రీ బృందం పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో పిఎం శ్రీ పథకం రాష్ట్ర బృందం జిల్లాలో గురువారం పర్యటించింది. ఈ పథకం కింద జిల్లాలో మొదటి, రెండో విడతలో 34 పాఠశాలలు ఎంపికయిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా పాఠశాలలో మౌలిక వసతులు,క్రీడా మైదానం, కెమిస్ట్రీ ల్యాబ్, మరుగుదొడ్లు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ఆ స్కూల్‌ను మోడల్ గా తీర్చిదిద్దడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.. ఉదయం మలిచర్ల జెడ్‌పి హైస్కూల్ మరి కొన్ని స్కూళ్లను పరిశీలించారు. అనంతరం 24 స్కూళ్ల ప్రిన్సిపల్స్ తో స్థానిక యూత్ హాస్టల్ జరిగిన సమావేశంలో బృందం సభ్యులు ఎస్ ప్రసాద్, మహేశ్వరరెడ్డి, జయలక్ష్మి మాట్లాడారు. ప్రధానంగా 34 పాఠశాలలు మోడల్‌గా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా నిధులు మంజూరు చేశామన్నారు. ఇంజినీరింగ్, సమగ్ర శిక్ష అధికారులు సమన్వయంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ పనులు వేగంగా పూర్తి చేస్తే మరిన్ని నిధులు జిల్లాకు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం పనులు జరుగుతున్న తీరు,సమస్యలు ఆయా పాఠశాలలు ప్రిన్సిపాళ్లను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు, ఇఇ హరిప్రసాద్, సెక్టోరియల్ సిబ్బంది, 34 పాఠశాలలు ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

నేడు జ్యోతిరావు పూలే జయంతి

ప్రజాశక్తి-విజయనగరం

మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా బిసి సంక్షేమాధికారిణి జ్యోతిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా కలెక్టరేట్ సమీపంలోని పూలే విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు నివాళులర్పి స్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, బిసి సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

తక్షణమే డిఎస్‌సి ప్రకటించాలి

డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వివిధ రకాల కారణాలతో డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చేస్తోందని, వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ డిమాండ్ చేశారు .గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు.ఏదో ఒక కారణం చూపి వాయిదాలు వేస్తున్నారు తప్ప నోటిఫికేషన్ విడుదల చేయడంలేదన్నారు, ఎస్సీ వర్గీకరణ కమిషన్ రిపోర్ట్ వచ్చాక, అని నిరుద్యోగులకు ఆశ పెడుతూ వచ్చారని, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏప్రిల్ మొదటి వారం నోటిఫికేషన్ ఇచ్చి జూన్‌లో స్కూల్ తెరిచే సమయానికి పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారన్నారు.. అలా చెప్పి వారం రోజులు అవుతున్నా దాని గురించి ఆలోచించే పరిస్తితి కనిపించడం లేదన్నారు. జిల్లాలో దాదాపు గా 20వేల మంది నిరుద్యోగులు డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అభ్యర్థుల పరిస్థితి దయనీయంగా ఉందని, గత ఏడేళ్ళుగా ఒక్క నోటిఫికేషన్ కూడా లేకపోవడంతో ఒక వైపు కుటుంబం నుంచి ఒత్తిడి, మరోవైపు అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి ఎదుర్కొంటూ నిరాశ చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వ హామీలు నమ్మి నోటిఫికేషన్లు వస్తాయని సంవత్సరాల తరబడి కోచింగ్ తీసుకోని విలువైన సమయాన్ని, డబ్బులను పోగొట్టుకొని ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో నిరుద్యోగులు ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 16, 347 పోస్టులను తక్షణమే భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

పేదల ఆకలి కేకలు వినిపించడం లేదా?

- **మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్**
- **వైసిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**



ర్యాలీ చేపడుతున్న వైసిపి నాయకులు, పింఛన్ల బాధితులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

పేద ప్రజల ఆకలి మీకు కనిపించడం లేదా.. ఇచ్చిన హామీని మరిచి పేదలను ఇబ్బంది పెట్టడం కూటమి ప్రభుత్వానికి తగునా.. మా ప్రభుత్వంలో ప్రతీ ఆరు నెలలకు ఒకసారి అర్హులైన ప్రతీ ఒక్కరికీ పెన్షన్ ఇచ్చేవారం.. ఇప్పుడెందుకు వృద్ధులను, వికలాంగులను, వితంతువులను ఇబ్బందులు పెడుతున్నారంటూ కూటమి ప్రభుత్వంపై మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ నిప్పులు చెరిగారు. అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వకపోవడంతో గురువారం మండల కేంద్రంలో వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు లేని హామీలను గుప్పించి అధికారంలోనికి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదల పథకాల అమలులో మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వంలో ప్రతీ ఆరు నెలలకు ఒకసారి అర్హులైన ప్రతీ ఒక్కరికీ పెన్షన్లను అందించే వారన్నారు. మండలంలో సుమారు 300 మంది అర్హులైన పేద వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇంత వరకు వారికి కూటమి ప్రభుత్వం న్యాయం చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 4 వేల మంది అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని పింఛన్ల కోసం పది నెలలుగా ఎదురు చూస్తున్నారని అన్నారు. అంతకు ముందు చీపురుపల్లి మేజర్ పంచాయతీ నుండి స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎఒ తామరాపల్లి ప్రవీణ్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌కు కూడా వినతి పత్రాన్ని అందజేసారు. ఈ కార్యక్రమంలో పింఛను లబ్దిదారులు, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైసిపి నాయకులు అధికార్ల శ్రీనుబాబు, పతివాడ రాజారావు, రఘుమండ త్రినాధరావు, చందక గురునాయుడు, పనస అప్పారావు, పిసిని శ్రీనివాసరావు, బెల్లాన త్రినాధరావు, ఇప్పిలి సూర్యప్రకాశరావు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, అన్ని గ్రామాల వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



కబ్జా చేసి పునాదులు వేసిన ప్రభుత్వ స్థలాన్ని చూపుతున్న కెఎల్‌పురం యువకులు

ప్రభుత్వ భూమి కబ్జా!

పరిరక్షించాలని కెఎల్‌పురం యువకుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో గల కెఎల్ పురం ప్రాంతంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని, ఈ భూమిని కాపాడాలని స్థానిక యువత అధికారులను కోరుతున్నారు. కెఎల్ పురం ప్రాంతంలో అపార్ట్‌మెంట్లు, గృహ నిర్మాణాలు చేపట్టడంతో భూమి విలువ బాగా పెరిగింది. సుమారుగా గజం భూమి 20 వేలు నుంచి 30 వేలు వరకు ధర పలుకుతుంది. ఈ నేపథ్యంలోనే సర్వే నెంబర్ 165 లో 45 లో27 సెంట్లు భూమి కబ్జా చేసి ఏకంగా పునాదులు వేశారని స్థానిక యువకులు ఆరోపిస్తున్నారు. గురువారం ఆ భూమి వద్దకు వెళ్లి పరిశీలించారు. అదే ప్రాంతం లో ఓ ప్రైవేటు లే అవుట్ ఉంది. అక్కడ భూమిని ఇళ్లకోసం కొనుగోలు చేసుకొని పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేస్తున్నారని యువకులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

త్వరలో స్టూడెంట్ కిట్స్

రాష్ట్ర పరిశీలకులు ప్రసాదరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



స్టాక్‌పాయింట్ పాఠశాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు ప్రసాదరావు

సర్వేపల్లి రాధాకష్ణ విద్యార్థి మిత్ర రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ఎస్.ప్రసాద్ రావు గురువారం విజయనగరం మండల స్టాక్ పాయింట్ సెయింట్ ఆన్స్ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల కిట్లు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జిల్లాలో గల 1వ తరగతి నుండి పదో తరగతి విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్స్ అందజేస్తామని తెలిపారు. ఈ సామాగ్రిని సురక్షితమైన ప్రదేశాల్లో భద్రపరచాలని సూచించారు . జిల్లాలోని ప్రతి ఒక్క విద్యార్థికి స్టూడెంట్ కిట్ అందేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ ఎ. రామారావు , సిఎంఒ వి.ఆదినారాయణ, ఎఎంఒ బి.ప్రసాదరావు, అసిస్టెంట్ సిఎంఒ కె.రామారావు, ఎంఇఒ సత్యవతి ఉన్నారు.

జిఒ 35ను ఉపసంహరించాలి

పంచాయతీ రాజ్ ఉద్యోగుల డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు

జీవో 30ను తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించాలని ఎపి పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం పంచాయతీ మినిస్టీరియల్ ఉద్యోగులు సంఘం భవనంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఇటీవల పంచాయతీ రాజ్ శాఖలో తెచ్చిన సంస్కరణల వలన పరిపాలన అధికారులకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. అదే సమయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 35లో జిల్లా పరిషత్, మండల పరిషత్ లలో పనిచేస్తున్న పరిపాలన అధికారులకు ఎంపిడిఒ ఉద్యోగోన్నతి కోటాలో తీరని అన్యాయం జరిగిందని అన్నారు. సంస్కరణలో భాగంగా ఎంపిడిఒ నేరుగా నియామక కోటాను రద్దు చేసినందున తమకు కేడర్ స్ట్రెంత్ ప్రకారం ఉద్యోగోన్నతిలో 50శాతం కేటాయించవలసి ఉండగా, కేవలం 34శాతం మాత్రమే కేటాయింపు చేయడం దారుణమని తెలిపారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు, రికార్డు అసిస్టెంట్లకు, ఆఫీస్ సబార్డినేటర్లకు తీరని నష్టం జరుగుతుందన్నారు. కావున ఈ జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు సిహెచ్ మురళీ, కార్యదర్శి వి.రాంబాబు, ఎన్జీఓ సంఘం జిల్లా కార్యదర్శి ఎ.సురేష్, జిల్లా పరిషత్ ఎఒలు త్రినాథ్, చైనులు, వేదవతి, రాజేశ్వరి, ప్రసాద్, బంగారయ్య, జిల్లా సంఘ నాయకులు పరిషత్తు యూనిట్ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలపై జెసి సమీక్ష

ప్రజాశక్తి-విజయగనరంకోట

గ్రంథాలయాల పర్సన్ ఇంచార్జ్ గా ఛార్జ్ తీసుకున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం లైబ్రేరియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రరీ కు విచ్చేసిన విద్యార్థులు, రీడర్స్ తో మాట్లాడి లైబ్రరీ లో అందుతున్న పుస్తకాలు, సౌకర్యాల పై అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాలకు రావలసిన సెస్‌ను వసూలు చేయాలని లైబ్రరీయన్లకు సూచించారు. సమావేశంలో గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మీ, జిల్లా కేంద్ర గ్రంథాలయం లైబ్రేరియన్ శ్రీనివాస్, మండల గ్రంథాలయాల లైబ్రరీయన్లు పాల్గొన్నారు.

15న పిఎం అప్రెంటిస్‌షిప్ మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 15న ఉదయం 9గంటల నుంచి ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటి కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. ఐటిఐ పాసైన వారు ఈ అప్రెంటిస్ షిప్ మేళా లో పాల్గొనవచ్చునని తెలిపారు. మైలాన్ లేబొరేటరీ, వరుణ్ మోటార్ ప్రైవేటు లిమిటెడ్, జయభేరి ఆటోమోటివ్ లిమిటెడ్ , శ్యాంసంగ్ అథరైజెడ్ సర్వీస్ సెంటర్ (ఎస్ఆర్ఎస్), శ్యాంసంగ్ ఆథరైజ్డ్ సర్వీసు సెంటర్ (నవదీప్ ఎలక్ట్రానిక్స్), పిట్టీ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, హెచ్‌బిఎల్ పవర్ సిస్టమ్స్ , జె.వై. సొల్యూషన్, డెక్కన్ ఫెర్రో అల్లోయిస్ , వోల్టాస్ ఆథరైజెడ్ సర్వీస్ సెంటర్, తదితర ప్రముఖ కంపెనీలను ఆహ్వానించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి ఆయా పరిశ్రమలలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన స్టయిఫండ్ చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్స్, ఆధార్ కార్డ్, 2 ఫోటోస్‌తో పాటు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేసారు. వివరాలకు 9849118075, 9849944654 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పంప్‌హౌస్ పరిశీలన

ప్రజాశక్తి-బాడంగి, దత్తిరాజేరు



ట్రాన్స్‌ఫార్మర్ యార్డును పరిశీలిస్తున్న ఎస్ఇ కవిత

దత్తిరాజేరు, బాడంగి మండలాలకు తాగునీరు అందించే రక్షిత నీటి పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ కవిత గురువారం తనిఖీ చేశారు. ఈ పథకం నుంచి నీటి సరఫరాపై ఆరా తీశారు. బుధవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో బాడంగి జెడ్‌పిటిసి సభ్యులు లేవనెత్తిన తాగునీటి సమస్యపై జిల్లా కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ, ఈ పథకాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కవిత ఈ పథకాన్ని గురువారం పరిశీలించారు. బాడంగి మండలంలోని వేగావతి నదిపై పాల్తేరు గ్రామం వద్ద ఉన్న ఊటబావుల నుంచి బాడంగి, దత్తిరాజేరు మండలాల్లోని 68 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. ఈ పథకం సక్రమంగానే పనిచేస్తోందని, ఎటువంటి అంతరాయం లేదని ఆమె తెలిపారు. మొత్తం 68 గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతోందని ఎస్ఇ స్పష్టం చేశారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు శిక్ష

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా మహిళా పోలీసు స్టేషనులో 2021 సంవత్సరంలో నమోదైన అత్యాచారం, నమ్మించి మోసగించిన కేసులో నిందితుడైన విజయనగరానికి చెందిన మొయిద పైడిరాజుకు విజయనగరం 5వ ఎడిజె, మహిళా కోర్టు ఒక ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పినట్లు మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇ.నర్సింహమూర్తి తెలిపారు. దాసన్నపేటకు చెందిన నిందితుడు మొయిద పైడిరాజు పట్టణానికి చెందిన ఒకామెను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి, అత్యాచారానికి పాల్పడినట్లుగా ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో మహిళా పోలీసు స్టేషనులో 2021లో అప్పటి ఎస్ఐ పి.శ్యామలాదేవి కేసు నమోదు చేయగా, డిఎస్‌పి టి.త్రినాధరావు దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో మహిళా కోర్టు న్యాయమూర్తి ఎన్.పద్మావతి నిందితుడు పైడిరాజుకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు సిఐ తెలిపారు.



చెక్కు అందజేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

పోలీసు కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసుశాఖలో పని చేసి, ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించిన ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో కానిస్టేబుల్ పనిచేసిన సిహెచ్ గోపాలరావు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు 'చేయూత'గా పోలీసు సిబ్బంది పోగు చేసిన రూ.1,48,000 చెక్కును ఆయన సతీమణి సిహెచ్ శారదకు ఎస్‌పి వకుల్ జిందాల్ అందజేశారు. ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం సకాలంలో కల్పించే విధంగా చర్యలు చేపడతామని, వెంటనే దరఖాస్తు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, డిపిఒ ఎఒ పి.శ్రీనివాసరావు, ఆఫీసు సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, పోలీసు అసోసియేషను అడహక్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నుల బకాయిల మొత్తాన్ని ఒకేసారి ఈనెల 30వ తేదీలోగా చెల్లిస్తే 50శాతం శాతం వడ్డీ మాఫీ సదుపాయాన్ని పొందవచ్చునని కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఏక మొత్తం పన్నును ఒకేసారి చెల్లిస్తే ఐదు శాతం రిబేట్ సౌకర్యాన్ని ఇప్పటికే ప్రభుత్వం కల్పించిందన్నారు. తాజాగా విడుదల చేసిన జీవో ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను లను ఈ నెల 30వ తేదీలోగా వెంటనే చెల్లించి 50శాతం వడ్డీ మాఫీ సదుపాయాన్ని పొందాలని కోరారు.

లోకో పైలెట్లపై పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

రైల్వే లోకో పైలెట్లపై పని భారం తగ్గించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ లోకో పైలెట్లకు విశ్రాంతి లేకుండా నిరంతరాయంగా పని చేయాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, తక్షణమే ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలన్నారు. రైల్వే ఉద్యోగులపై పని భారం పెరగడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. రైల్వేలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ నెల 19న విశాఖలో జరిగే సేఫ్టీ రైల్వే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఆయనతో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం ఉన్నారు.

రెల్లి కులస్తులకు రిజర్వేషన్ పెంచాలి

బొబ్బిలి : రెల్లి కులస్తులకు రిజర్వేషన్ పెంచాలని రెల్లి కుల సంక్షేమ సంఘం నాయకులు పి.చంద్రశేఖర్, జి.విజయకుమార్ గురువారం స్థానిక కోటలో ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. రెల్లి కులస్తులు అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారని, రిజర్వేషన్ పెంచి న్యాయం చేయాలని కోరారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిరసన

బొబ్బిలి : పేదలకు ఇళ్ల స్థలాలు, గిరిజనుల సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్, పి.కృష్ణ పాల్గొన్నారు.

పనిచేయని మిషనరీ వేలం వేయండి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ ఐటిఐలో పని చేయని మిషనరీలు, టూల్స్ వేలం వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఐటిఐల ఆర్‌డిడి ఆర్.వి.రమణ.. ప్రిన్సిపల్ రమణరావును ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐలో పని చేయని మిషనరీ, టూల్స్‌ను మూడు రోజుల నుంచి పరిశీలించారు. వాటిని ఆన్‌లైన్‌లో వేలం వేయాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. ఐటిఐలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అందని రేషన్ సరుకులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తమ్మాపురం వాసులకు ఇంతవరకు రేషన్ సరుకులు అందలేదు. తమ్మాపురం, ఆల్తిపాలెం గ్రామాల్లో సుమారు 300 రేషన్ కార్డు లబ్ధిదారులు ఉండగా వీరికి 10 రోజులు గడుస్తున్నా ఇంతవరకు రేషన్ సరుకులు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి రేషన్ సరుకులు వచ్చాయి గాని అవి ఎవరి దగ్గర ఉన్నాయో తెలియని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. కాగా గత నెల ఇక్కడ డీలర్‌గా వ్యవహరించిన వ్యక్తిని ఫోర్జరీ సంతకాలతో భూ అమ్మకాలు జరిపారన్న కేసులో అరెస్ట్ చేశారన్నారు. డీలర్ లేనప్పుడు సంబంధిత అధికార్లు రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సిన భాధ్యత లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికార్లు స్పందించి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం దాసన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9గంటల నుండి 12గంటలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ డిఇఇ పి.త్రినాధరావు తెలిపారు. ఈ మరమ్మత్తుల పనులు కారణంగా దాసన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలో గల పోర్టుసిటీ స్కూల్, టౌన్ సెంటర్ లేఅవుట్, శ్రీనివాస నగర్, వినాయకనగర్, పిఆర్ కాలనీ, కృష్ణ రాజపురం, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

నెల్లిమర్ల మండలంలో..

నెల్లిమర్ల : కొండవెలగాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు తెలిపారు. కొండవెలగాడ సబ్‌స్టేషన్ 33/11 కెవి ఎస్ఎస్‌హెచ్ క్యూ ఫీడర్, పారసాం రూరల్ ఫీడర్ వ్యవసాయ కనెక్షన్ నిర్మాణం, పనుల పొడిగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం సబ్ స్టేషన్ పరిధిలో కొండ వెలగాడ, చంద్రంపేట, ఎల్ఎన్‌పురం, తాళ్లపూడి పేట, టెక్కలి, తుమ్మలపేట, చిన బూరాడపేట, పెదబూరాడపేట, పారసాం, గెద్దపేట, గుర్ల మండలం భూపాలపురం, ఆనందపురం గ్రామాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. రామతీర్థం 11కెవి సబ్ స్టేషన్ పరిధిలో కూడా ఆయా గ్రామాలకు శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని చాలని ఆయన కోరారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బొద్దాం గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో అధిక సంఖ్యలో రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. వారికి వైద్యులు రాజేష్, లత పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు రిఫర్ చేశారు.

బిసి రుణాలకు 110 దరఖాస్తులు

ప్రజాశక్తి-బొబ్బిలి

బిసి కార్పొరేషన్ రుణాల కోసం బ్యాంకులకు 110 మంది దరఖాస్తులను మున్సిపల్ అధికారులు అందించారు. బొబ్బిలి మున్సిపాలిటీకి బిసి కార్పొరేషన్ ద్వారా 87 యూనిట్లు మంజూరుకాగా, 750 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలో 110 మంది దరఖాస్తులను బ్యాంకులకు అప్పగించినట్లు టిపిఆర్‌ఒ ఎం.జగన్మోహన్ చెప్పారు. ఏవైనా దరఖాస్తులు తిరస్కరిస్తే, రెండో విడతలో దరఖాస్తులను బ్యాంకులకు అందిస్తామని తెలిపారు.

20 మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని టెక్కలిలో 20 అక్రమ మద్యం బాటిళ్లను పోలీసులు గురువారం పట్టుకున్నారు. స్థానిక ఎస్ఐ బి గణేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలి గ్రామంలో బెల్ట్ షాప్‌లో అక్రమంగా మద్యం అమ్ముతుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. సీసాలను స్వాధీనం చేసుకుని బెల్ట్ షాపు నిర్వాహకుడును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి వెయ్యి రోజుల ప్రణాళిక

ప్రజాశక్తి-గంట్యాడ

తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం వెయ్యి రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఐసిడిఎస్ పీడీ రుక్సానా బేగం తెలిపారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని కొర్లాం అంగన్వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. గర్భం దాల్చిన నుంచి బిడ్డకు రెండేళ్ల వయసు వచ్చే వరకు పోషక విలువలతో కూడిన ఆహారం అందాలని, దానివల్ల ఆరోగ్యవంతమైన తరం సమాజానికి అందుతుందని చెప్పారు. పోషకాహార లోపం పెద్ద సమస్యని, దాన్ని నివారించడానికి ప్రత్యేకంగా గుర్తించి, పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. పిల్లల్లో ఊబకాయ సమస్యను తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించాలని అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ పిల్లలతో ఆమె మమేకమయ్యారు. గృహ సందర్శనలో భాగంగా బాలింతలకు అందుతున్న పౌషకాహారంపై ఆరాతీశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నారులతో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ రుక్సానా బేగం

బొండపల్లి : మండలంలోని గొట్లాం సెక్టార్ పరిధిలోని నెలివాడ గ్రామంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ జానకి, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, ఎఎన్ఎం కె.గౌరీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తవలస : బలిఘట్టం అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మహోత్సవాన్ని నిర్వహించారు. కొత్తవలస సెక్టార్ సూపర్వైజర్ కె.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బొద్దాం అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వియ్యంపేట ఐసిడిఎస్ పిఒ బి.లక్ష్మీబాయి, సూపర్వైజర్ కామేశ్వరి, అంగన్వాడీలు ఎస్.కె అమ్మాజీ, కె.సత్యవతి, ఎఎన్ఎం జి.సంతోషి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

బొబ్బిలి : పట్టణంలోని జంగళవీధి, అగ్రహారంవీధి, చిన్న చెరువుగట్టు, సింగరపువీధి, కుమ్మరివీధి, మంగళవీధి అంగన్వాడీ కేంద్రాలలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేయాలి

సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - వంగర

విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేసి, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఎపి రెవెన్యూ సహాయకుల సంఘం (విఆర్ఎ)లు సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ డి.ధర్మరాజుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షులు వై.అప్పలస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణ మాదిరిగా ఇక్కడ కూడా పే స్కేల్ అమలు చేస్తుందని, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తిస్తారని ఆశించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనకు సిద్ధం కాబోతున్నామన్నారు. అందులో భాగంగా తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేసినట్లు ఆయన వెల్లడించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకుల సిహెచ్ దుర్గారావు, కె.పార్వతి, కె. ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతినిస్తున్న విఆర్ఎలు

రేగిడి: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ చిన్నా రావుకు గురువారం ఆ సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు జగన్, పాదాలరావు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు సేవలందిస్తున్న విఆర్ఎల జీతభత్యాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ధరల్లో రూ.10,500 నెల జీతంతో ఎలా బతకాలని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. వీరితో పాటు సంఘం ప్రతినిధులు బాలరాజు, సత్యనారాయణ, పోలిరాజు ఉన్నారు.

సంతకవిటి: విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ తహశీల్దార్ బి.సత్యంకి వినతి పత్రాన్ని గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.రాములు (శివాజీ), కె.రామప్పయ్యా, కే.నారాయణ రావు, బి.తౌడు, కె.పాపారావు పాల్గొన్నారు.

సారారహిత సమాజానికి సహకరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సారా రహిత సమాజానికి అన్ని వర్గాలూ సహకరించాలని ఎంపిపి అంబళ్ల సుధారాణి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నవోదయం 2.0 పై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపిపి సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం నాటు సారా తయారీ నిర్మూలనకు నవోదయం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా నెల్లిమర్ల, గుర్ల మండలాల్లో నాటు సారా తయారు చేస్తున్న గ్రామాల్లో అవగాహన కల్పించి వారిని సారా తయారు చేయకుండా ఆపడానికి నవోదయం మండల కమిటీలు, గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీలు ఆయా గ్రామాల్లో నాటు సారా తయారీ నిర్మూలన చేయడానికి కృషి చేసి నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చు దిద్దడానికి కృషి చేస్తాయన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు, డిటి రవిశంకర్ పి.సుదర్శనరావు, ఎక్సైజ్ సిఐ ముంజేటి వెంకటరావు, ఎఎస్ఐ మూర్తి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి

ప్రజాశక్తి-గంట్యాడ

ఉద్యాన పంటలపై రైతులు దృష్టిపెట్టేందుకు అవగాహన కల్పించాలని ఆ శాఖ అధికారి టి.అనిత వ్యవసాయ సిబ్బందికి సూచించారు. గురువారం గంట్యాడ ఆర్ఎస్‌కెలో వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. సుమారుగా 500 ఎకరాల్లో ఉద్యాన పంటలు పెంచడానికి కృషి చేయాలన్నారు. సోషల్ ఫారెస్ట్ ద్వారా సరుగుడు మొక్కలు వేయించడానికి అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి ఆర్ఎస్‌కెలో 44 మట్టి నమూనాలను సేకరించి, ఈ నెలాఖరికి మండల కేంద్రానికి పంపించాలని కోరారు. ప్రతి రైతూ ఎపిఎస్ఆర్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్ఒ రాజేశ్వరరావు, ఎఒ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నించేందుకు సభ్యులు కరువు

- 22 మంది సర్పంచులున్నా 9 మందే హాజరు
- ఇలా వచ్చి అలా వెళ్లిపోయిన కూటమి ఎంపిటిసిలు
- తాగునీటి సమస్య ఉంటే మాదృష్టికి తీసుకురండి : ఎంపిపి



సమావేశంలో మాట్లాడుతున్న అనూషరెడ్డి

ప్రజాశక్తి - భోగాపురం

సమస్యలపై అధికారులను ప్రశ్నించేందుకు సభ్యులు కరువయ్యారు. దీంతో అధికారులు తమశాఖ చేపడుతున్న వివరాలను ప్రకటించి వెళ్లిపోయారు. ఇది మండల సర్వసభ్య సమావేశం జరిగిన తీరు. ఎంపిపి ఉప్పాడ అనూషరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ కిషోర్ కుమార్ గురువారం నిర్వహించారు. మూడు నెలలకు ఒకసారి ఈ సమావేశాన్ని నిర్వహిస్తుంటారు. ఎన్నికల కోడ్ కారణంగా గత సమావేశం వాయిదా పడింది. దీంతో గురువారం నిర్వహించిన సమావేశానికి ఎన్నడూ లేనివిధంగా సభ్యులు గైర్హాజరు కావడం విశేషం. మండలంలో 22 మంది సర్పంచులు ఉండగా కేవలం 9 మంది మాత్రమే హాజరయ్యారు. కూటమి ఎంపిటిసిలు వచ్చి ఐదు నిమిషాలు కూడా ఉండకుండా వెళ్లిపోవడం విశేషం. దీంతో ఉన్న కొద్దిమంది సభ్యులే తమ పంచాయతీలకు చెందిన కొన్ని సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. తాగునీటి పైపులైను మరమ్మతులకు గురైన పట్టించుకోవడంలేదని ముంజేరు సర్పంచ్ నూకరాజు ప్రశ్నించారు. తమ పంచాయతీలో మేట్లను మార్చే ప్రయత్నం చేస్తున్నారని వారంతా వచ్చి తమను ప్రశ్నిస్తున్నారని వైస్ ఎంపిపి రావాడబాబు ఎపిఒ దృష్టికి తీసుకెళ్లారు. మరడపాలెం ఆర్అండ్ఆర్ కాలనీలోని ఇళ్ల నిర్వాసితుల పేరు మీద రిజిస్ట్రేషన్ లేకపోవడంతో రుణాల తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని కవులవాడ సర్పంచ్ అన్నారు. నిషేధిత భూ జాబితా నుంచి తొలగించాల్సి ఉందని దీనిని కలెక్టర్ దృష్టిలో పెట్టామని డిటి సుభాష్ తెలిపారు. వేట నిషేదానికి ముందే మత్స్యకార భరోసా రైతుల మత్స్యకారులకు అందజేయాలని బర్రి చిన్నప్పన మత్స్యశాఖ అధికారిని కోరారు. అనంతరం వివిధ సమస్యలను రావాడ సర్పంచ్ పైడినాయుడు, నందిగాం సర్పంచ్ మురళి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపిపి అనూషరెడ్డి మాట్లాడుతూ వేసవికాలం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వైస్ ఎంపిపి పచ్చిపాల నాగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యం

గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి- మెంటాడ


వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం స్థానాల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఇప్పట్నుంచే పనిచేయాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. గురువారం టిడిపి మండల కార్యకర్తలు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇచ్చిన హామీలన్నింటినీ ప్రాధాన్య క్రమంలో దశలవారీగా అమలుచేసి చూపుతామన్నారు. వచ్చే నెలలోనే తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ 15 వేలు చొప్పున అందజేస్తామని తెలిపారు. రైతుభరోసాను కూడా విడుదల చేస్తామన్నారు. అన్ని గ్రామాలకు తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. చేసిన మంచిని చెప్పుకోకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని హెచ్చరించారు. స్థానికంగా ప్రభుత్వ పథకాల అమలుపై ఎప్పటికప్పుడు సమీక్షించి ప్రజల స్పందనకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆగూరు గ్రామం నుంచి 15 కుటుంబాలు మంత్రి సమక్షంలో టిడిపిలో చేరాయి. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, నాయకులు జి.అన్నవరం, రెడ్డి ఆదినారాయణ, ఆర్.రవి శంకర్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎన్నో ఏళ్ళు నుండి గ్రామస్థాయిలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గురువారం ఫీల్డు అసిస్టెంట్ల యూనియన్ (సిఐటియు ఆధ్వర్యాన ఎంపిడిఒ సతీష్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బుల్లిపల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అక్రమంగా తొలగించిన వారిని విధుల్లోకి చేర్చుకోవాలని, అర్హత, అనుభవం కలిగిన వారికి ప్రమోషన్ కల్పించాలని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ తొలగింపులు ఆపాలని కోరారు. మేండేస్‌కు విధానాన్ని రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు జి.ఈశ్వరరావు పెంటయ్య, దేవుడు బాబు, ఎస్వీశ్వరరావు, డి సోమేశ్వర్, కె.బంగారమ్మ సాంబ తదితరులు పాల్గొన్నారు.


ఎస్.కోట ఎంపిడిఒకు వినతినిస్తున్న ఫీల్డు అసిసెంట్లు


మెరకముడిదాం ఎంపిడిఒకు వినతినిస్తున్న ఫీల్డు అసిస్టెంట్లు

మెరకముడిదాం : ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వారంతా ఎంపిడిఒ జి. భాస్కరరావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, అక్రమంగా తొలగించిన వారిని విధుల్లోకి చేర్చుకోవాలని, కోరారు. మేండేస్‌కు విధానాన్ని రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చీపురుపల్లి: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపిడిఒ సురేష్‌కి గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 19 ఏళ్ల నుండి తాము ఎన్నో ఒడిదుడులకు ఎదురొడ్డి ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నామని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు మ్యాన్‌డేస్ విధానాన్ని రద్దు చేసి ఫీల్డ్ అసిస్టెంట్లుకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తవుడు, అప్పలనాయుడుతో పాటు పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు తయారీ

ప్రజాశక్తి-కొత్తవలస

స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయ డిపిఎం ఆనందరావు, ఎఒ అరుణ్ కుమార్, మండల సమాఖ్య ఎపిఎం ఎ.వెంకటరమణ ఆధ్వర్యంలో నవధాన్యాల కిట్లు తయారు చేశారు. నువ్వులు, చిరుధాన్యాలు పంటలలో నవధాన్యాలు విత్తనాలు కలిపి అంతర పంటలు సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ వర ప్రసాద్, విఎఎలు హేమ, దుర్గారావు, మాస్టర్ ట్రైనర్ పి.కోటిబాబు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న డిపిఎం ఆనందరావు, ఎఒ

బహుళ పంటలతో రైతులకు లాభం

వేపాడ : బహుళ పంటల విధానంతో రైతులకు లాభమని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని వీలుపర్తి, కరకవలస, కుంపల్లి, పాటూరు, ఆకులసీతంపేట, కెజిపూడిలో గురువారం నవధాన్యాల కిట్లను రైతులకు అందుబాటులో ఉంచారు. ఒక్కో కిట్ రూ.100కు విక్రయిస్తున్నట్లు మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్ లీకేజీ పనులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అక్కడక్కడ ఏర్పడిన పైప్ లైన్ లీకేజీలను అరికట్టేందుకు గురువారం యుద్ద ప్రాతిపదికన మరమ్మతు పనులు చేశారు. కొత్తపేట, బాబా మెట్ట, సాకేటి వీధి తదితర ప్రాంతాలలో ఏర్పడిన లీకేజీలను అరికట్టారు. అలాగే వివిధ ప్రాంతాల్లో మరమ్మతులకు గురైన వీధిదీపాలను సిబ్బంది సరిచేస్తూ అవసర మైన చోట్ల కొత్త దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు వీధి దీపాల మరమ్మత్తులు చేపట్టడం గాని, కొత్తవి ఏర్పాటు చేయడం గానీ చేపట్టారు.


పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

జెసిబి ల సహాయంతో కాలువలు శుభ్రం

ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ప్రజారోగ్య సిబ్బంది పరిశుభ్రపరిచారు. జెసిబిల సహాయంతో పూడికపోయిన చెత్తాచెదారాలను తొలగించారు.. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ ప్రాంతంలో ప్రధాన కాలువ చెత్తలతో పేరుకుపోయి నీరు నిల్వ ఉండిపోయింది. కొంత నీరు రహదారిపైకి వచ్చింది. దీనిని గమనించిన కమిషనర్ పల్లి నల్లనయ్య వెంటనే కాలువ పరిశుభ్రతకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో జెసిబిలను రప్పించి త్వరితగతిన పూడికతీత ప్రక్షాళన చేపట్టారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, AT VIZIANAGARAM.
S.O.P. 4/2025.

Between:
1. Allu Appalanaidu, S/o late Apparao, residing at Pavada Village, Jami Rev. Mandal. Vizianagaram District.
2. Smt. Kotakala Ramadevi, W/o Venkata Prasad, Residing at M.V.P. Colony, Visakhapatnam
3. Smt. Lekkala Swapna, W/o Arjuanarao, Residing at Jnanapuram, Visakhapatnam
4. Smt. Jagarapu Lakshmi, W/o Venkata Rao, Residing at Purushothampuram, Pendurthi Mandal, Visakhapatnam District ....Petitioners
And :
-Nil- ....Respondents

NOTICE

Take notice that the Petitioners filed the above petition for the issue of succession certificate in their favour to receive an amount of Rs. 3,07,210/- as per the Decree dated 07-11-2012 passed in O.S. 123/2008 by the Senior Civil Judge Court, Vizianagaram, in favour of Allu Apparao, S/o Ramayya of Pavada Village, being his legal heirs. The said petition stands posted to 17-04-2025 and if anybody got any objection they can appear in person or through an advocate and file objections if any on **17-04-2025 at 10-30 A.M** in the above Court.

L.SATYANARAYANA.
Advocate for the Petitioners.
VIZIANAGARAM-535002